భక్తులతో మర్యాదగా, సేవాభావంతో ప్రవర్తించాలి

తిరుమలలో ఆకస్మిక తనిఖీలలో ఛైర్మన్ నాయుడు

తిరుమల,ఏప్రిల్17ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవారి దర్శనం కోసం భక్తితో వస్తున్న భక్తులను ఉద్యోగులు,సిబ్బంది సేవాభావంతో,మర్యాదపూర్వకంగా పలకరించాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు ఆదేశించారు. భక్తుల్లో భగవంతున్ని చూడాలన్నారు. గురువారం రాత్రి దర్శనానంతరం ఆలయం వెలుపలు ఉన్న భక్తులను ఛైర్మన్ కలసి తిరుమలలో సేవలు,సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులు అన్ని రకాల సేవలపై ఆనందం వ్యక్తం చేశారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మంచినీటి సమస్య

ఉత్పన్నం కాకుండా పక్కా చర్యలు

- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుండి హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జెసి జి.విద్యాధరిలు

చిత్తూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

వేసవి కాలంలో ఎక్కడా మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా పక్కా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. అమరావతి నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వేసవిలో మంచినీటి సరఫరాకు సంబంధించి కార్యాచరణ, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సమీక్షకు చిత్తూరు కలెక్టరేట్ నుండి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి అధికంగా వున్న మండలాలు, గ్రామాలను గుర్తించి అక్కడ మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కరవు ప్రభావిత మండలాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయడంతో పాటు అవసరమైన చోట్ల ప్రైవేటు మంచినీటి వనరులను అద్దె ప్రాతిపదికగా తీసుకుని ప్రజలు మంచినీటి అవసరాలను తీర్చాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి మంచినీటి సమస్యపై ఫిర్యాదులు స్వీకరించి వాటిని సత్వరం పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో ఎక్కడ మంచినీటి ఇబ్బంది తలెత్తకూడదని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు అన్ని పూర్తిగా నీటితో నింపాలని, జలవనరులశాఖను సమన్వయం చేసుకుని కాలువలకు అడ్డుకట్ట వేసి చెరువులకు నీటిని మళ్ళించి వాటిని పూర్తిగా నీటితో నింపాలన్నారు. అలాగే నీటి కాలుష్యం వల్ల వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వచ్ఛంధ్రా దినోత్సవంను ప్రతి నెల పక్కాగా నిర్వహించి కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా వుంచడానికి కృషి చేయాలన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాల(ఈ-వేస్ట్) సక్రమ నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ-వ్యర్థాల సేకరణపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ-వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయడం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి పోస్టర్లు, కరపత్రాలు, ప్రకటనలు, సోషల్ మీడియా ద్వారా ప్రసారాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిఎడి ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, ఎపిఐఐసి ఎండి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ అభిషిక్త్ కిషోర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్‌కుమార్‌రెడ్డి, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

గోవుల మరణాలపై చల్లారని రగడ

రాజకీయనేతల వాదోపవాదాలతో గందరగోళం! భూమన ఇంటివద్ద ఉద్రిక్తత
కూటమిపార్టీల ఎమ్మెల్యేల నిరీక్షణ - ఓ దశలో అభినయ్ అరెస్టు
అబద్దాలు చెప్పి నాటకాలంటూ కూటమి ఆగ్రహం

తిరుపతి, ఏప్రిల్ 17ప్రభాతవార్త:

తిరుపతి ఎస్వీగోశాలలో మూగజీవాల మృతిపై రాజకీయ రగడలో అటు వైసిపి కరుణాకర్‌రెడ్డి ఇటు టిడిపి కూటమి నేతల బహిరంగ చర్చకు సవాల్ విసరడంతో గురువారం ఉదయం తిరుపతి నగరంలో హైటెన్షన్ నెలకొంది. ఎస్వీగోశాల వద్ద కూడా ఈ రచ్చ సాయంత్రం వరకు గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. వైసిపి నేత, టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి గోశాలలో వందకుపైగా గోవులు మరణించాయని అబద్దపు ప్రచారం చేశారనే కూటమి పార్టీల నేతలు చర్చకు సిద్దమా అని పిలుపు నిచ్చారు. ఈ పిలుపుతో ఓ వైపు వైసిపి నేతలు,కార్యకర్తలు, మరోవైపు టిడిపి కూటమి ఎమ్మెల్యేలు, నేతలు,కార్యకర్తలు భారీగా తరలివచ్చి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తారని ముందస్తుగా పోలీసులు సూచనలు చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ ఎ.రవిమనోహరచారి,తిరుపతి డిఎస్పీలు ఎం.భక్తవత్సలం, ప్రసాద్, భారీగా పోలీసుబలగాలు మోహరించాయి. దీనికి ముందుగానే పోలీసులు తిరుపతినగరంలో,గోశాల వద్ద ప్రశాంతవాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకున్నారు. కూటమి ఎమ్మెల్యేలతోబాటు వైసిపి నేత భూమన కూడా భారీగా కార్యకర్తలతో రాకూడదని, గన్‌మెన్‌లతోనే గోశాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని కోరారు. అయితే వైసిపి నుండి కొంత విముఖత రావడంతో ముందస్తుగా వైసిపి నేతలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఎస్వీగోశాల ఉన్న తుమ్మలగుంట ప్రాంతంకు ఏ పార్టీ నాయకులైనా గుంపులుగా రావద్దని పోలీసులు సూచించారు. కార్యకర్తలతో కాకుండా గన్‌మెన్‌లతో రావాలని,గోశాలను సందర్శించి మీడియాతో మాట్లాడి వెళ్ళిపోవాలని కోరారు. అయితే అప్పటికే కూటమి పార్టీల ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తినాని, డాక్టర్ మురళీ మోహన్, బొజ్జల సుధీర్‌రెడ్డి, డాక్టర్ థామస్,తిరుపతి నేతలు నరసింహయాదవ్, సుగుణమ్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, కంకణాల రజినీకాంత్‌నాయుడు, సిఆర్ రాజన్ చేరుకుని గోశాలలోని ఆలయం వద్ద వేచివున్నారు.

-గత పాలకమండలి నిర్వాహకాలపై రగడ

గోశాలలో ఘోరాలు జరుగుతున్నాయంటూ గొంతు చించుకున్న వైసిపి నేతలకు టిడిపి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఆవుల మృతిని రాజకీయ లబ్దికోసం వాడుకోవాలని ప్రయత్నించిన వైసిపి చివరకు అబాసుపాలైందని కూటమి ఎమ్మెల్యేలు అన్నారు. గోశాలలోనికి అడుగుపెట్టేందుకు యత్నించిన భూమన అభినయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే కూటమి నేతల ఛాలెంజ్‌ను స్వీకరించానని అభినయ్ అక్కడ గొంతు వినిపించాడు. టిడిపి పోలీసులతో మమ్మల్ని అడ్డుకుందని ఆరోపించారు.మరోవైపు భూమన కరుణాకర్‌రెడ్డి ఇంటివద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆయన ఏకంగా రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు.

భూమనకు బొజ్జల ఫోన్:

గోశాలలో వందకుపైగా గోవులు మృతిచెందాయని వైసిపి నేత భూమన అబద్దపు ప్రచారం, ఆరోపణలపై కూటమి పార్టీల నేతలు చర్చకు సవాల్ విసిరారు. దీంతో పోలీసులు బయటకు రానీయలేదని భూమన కూటమినేతలకు తెలియజేశాడు. అయితే పోలీసు ఎస్కార్ట్ మధ్య తీసుకువస్తామని, మీ అంగీకారం చెప్పాలని, జగన్ పాలనలో అక్రమాలు జరిగాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కరుణాకర్‌రెడ్డికి ఫోన్‌లో సంభాషించాడు. గత ఏడాది ఏప్రిల్ 2024 నుండి మార్చి 2025 వరకు 191 గోవులు వృద్ధాప్యం, వ్యాధులతో చనిపోయాయని గణాంకాలు తెలిపారు. దీంతో ఈ అనుమానాలు ఇప్పుడు వైసిపికి బలాన్ని చేకూర్చింది.

ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరు భేష్

రేణిగుంట ఏప్రిల్ 17 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం తూకివాకం వద్ద ఉన్న తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరు బాగుందని 16వ ఆర్థిక కమిషన్ బృందం తెలిపింది. ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ (చెత్త నుండి సంపద కేంద్రం) ను గురువారం పరిశీలించిన 16వ ఆర్థిక కమిషన్ బృంద సభ్యులు రిత్విక్ పాండే, అన్నే జార్జ్ మ్యాథ్యూ, కేకే మిశ్రా, అభయ్ మీనన్, ఆదిత్య పంత్, అమృత తదితరులు పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త నిర్వహణ కంపోస్టు, బయో మెథనైజేషన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల పై ప్రిన్సిపాల్ సెక్రటరీ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ సురేష్ కుమార్, జే.నివాస్, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య బృందానికి వివరించారు. ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా సుస్థిర వ్యవస్థ ఏర్పాటుతో చెత్త నుండి సంపద తయారీ విధానాన్ని తెలియజేశారు. తిరుపతి నగరంలో సేకరించిన తడి, పొడి చెత్త ద్వార పొడి చెత్త నిర్వహణ చేస్తారని, ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్త ను సేకరించి కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారని విసిదీకరించారు మార్కెట్ నుండి వెలువడే , హోటల్స్ నుండి సేకరించిన వ్యర్థాల ద్వారా చేసి వంట గ్యాస్ ను ఉత్పత్తి చేసి విక్రయించడం జరుగుతుందని తెలిపారు. తిరుపతి లో ప్రతిరోజూ ఉత్పతి అయ్యే సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను సేకరించి ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తారని, ఉత్పతి అయిన ఇసుక, గుల్ల తో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ తడి చెత్త 150 టన్నులు, 75 టన్నులు పొడి చెత్త సేకరిస్తారన్నారు. ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు.లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలో మొదలైన

సంస్థాగత ఎన్నికల సందడి

పనితీరు ఆధారంగానే పార్టీలో పదవులు..
నియోజకవర్గాల్లో నేతలు బిజీబిజీ !!

కుప్పం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధికార తెలుగుదేశం పార్టీలో సంస్థాగత ఎన్నికల సందడి మొదలైంది. ప్రతి రెండేళ్లకు ఓసారి జరిగే ఈ సంస్థాగత ఎన్నికల్లో పార్టీ పదవులను భర్తీ చేస్తారు. మే 15వ తేది కల్లా పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెదేపా సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జ్‌లు సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు తగు ప్రణాళికలు రూపొందించారు. పార్టీ పరంగా ఎస్సీ, ఎస్టీ, బిసి,మైనార్టీలకు సముచిత స్థానం కల్పించాలని సిఎం చంద్రబాబు ఆదేశాలు ఉన్నాయి. బూత్ స్థాయి మొదలు వార్డు, పంచాయతీ, మండలం, పట్టణం, నియోజకవర్గ స్థాయితో పాటు పార్లమెంటరీ స్థాయి వరకు పార్టీ పదవులను కట్టబెట్టనున్నారు. పార్టీ పరంగా నియమించే కుటుంబ సాధికార సారథుల ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది. ప్రతి 60మందికి ఇద్దరు కుటుంబ సాధికార సారథులను నియమించనున్నారు. వీరిలో ఒక్కో పురుషుడు, ఒక్కో మహిళను నియమిస్తారు. వీరు తమ ప్రాంత పరిధిలో ఉన్న 60మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలియజేయడం, వారు ఏయే పథకాలకు అర్హులుగా ఉన్నారోననే విషయం గుర్తిస్తారు.

పదవులకు పోటీ తప్పదా :

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో పార్టీ పదవులకు ఈసారి నేతల మధ్య పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ పరంగా నామినేటెడ్ పదవులు కొంతమేర భర్తీ అయిన నేపథ్యంలో ఎలాగైనా పార్టీ పదవులు అయినా దక్కించుకోవాలని ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నేతలు ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ పరంగా అటు సిఎం చంద్రబాబు నాయుడు, ఇటు మంత్రి నారా లోకేష్‌లు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో పార్టీ పదవులపై నేతలు ఉవ్విళ్లూరుతున్నారు.

పనితీరే పదవులకు ప్రామాణికం :

తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసిన నేతలు, కార్యకర్తలకే పార్టీ పదవులు కట్టబెట్టాలని అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. దీంతో పార్టీ కోసం కష్టించిన వారికి ఈసారి పార్టీ పదవుల్లో తగు ప్రాధాన్యత లభించనున్నట్లు స్పష్టమవుతోంది. పార్టీ కార్యకర్తల సమక్షంలోనే ఆయా పదవులను అందరి ఆమోదంతో ప్రకటిస్తారు. తెదేపా పరంగా కుటుంబ సాధికార సమితి సారథులతో పాటు వార్డు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్ పదవులు ఉంటాయి. అలాగే మండల పార్టీ అధ్యక్షులు, కార్యవర్గంతో పాటు మహిళా, రైతు, ఇతర అనుబంధ విభాగాల పదవులను సైతం భర్తీ చేస్తారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ ఇన్‌చార్జ్‌లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను సైతం ఎన్నుకుంటారు. ఏది ఏమైనా ఈనెల రోజుల పాటు అధికార పార్టీలో సంస్థాగత సందడి కొనసాగనుంది.

సింహవాహనంపై దర్శనమిచ్చిన

ముత్యాలమ్మ

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయంలో మూడురోజుల పాటు వైభవంగా నిర్వహించిన ముత్యాలమ్మ జాతర గురువారం రాత్రి గ్రామోత్సవంతో ముగిసింది. ఆదివారం రాత్రి చాటింపుతో ముత్యాలమ్మ జాతర ప్రారంభం అయ్యింది. మూడు రోజుల పాటు ఆలయం వద్ద అమ్మవారిని వివిధ రూపాల్లో దర్శించుకున్న భక్తులకు దేవస్థానం ఇఓ డి.బాపిరెడ్డి చక్కటి ఏర్పాట్లు చేసారు. ప్రతి రోజూ ఉదయం సాయంత్రం గ్రామంలో పోతురాజు, గంగపెట్టె ప్రదర్శనలు జరిగాయి. ప్రతి రోజూఆలయానికి వచ్చిన మహిళా భక్తులకు దేవస్థానం సదు పాయాలు కల్పించారు.జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు.

సింహవాహనంపై అమ్మవారి దివ్యదర్శనం

గురువారం రాత్రి ముత్యాలమ్మ అమ్మవారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారిని చక్కగా అలంకరించారు.సింహవాహనంపై ప్రతిష్టించారు. మేళతాళాలు మంగళవాయిద్యాలుతప్పెట్ల మోతతో గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. ముత్యాలమ్మ జాతర పూర్తి కావటంతో ధర్మరాజుల స్వామి ఆలయంలో ఉత్సవాల సన్నాహాల్లో నిమగ్నమౌతున్నారు. చిన్న ఆలయాల్లో జరిగే ఉత్సవాల పర్యవేక్షణను ఇఓ బాపిరెడ్డి డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డికి అప్పగించారు. ఆయన చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్యను చైతన్య పరుస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు.

వసూళ్ళకు తెరలేపిన డిఎంహెచ్‌ఓ కార్యాలయం

- పదోన్నతుల కౌన్సెలింగ్ పూర్తయి వారమైనా అభ్యర్థులకు ఇవ్వని పోస్టింగ్ ఉత్తర్వులు
- ఇప్పటికే కౌన్సెలింగ్‌లో పారదర్శకతకు పాతర
- పిహెచ్‌సి యుడిసిలకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చి వసూళ్ళు చేయడానికి యత్నాలు

చిత్తూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ పోస్టింగ్స్ జారీ చేయడంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వసూళ్ళకు తెర తీశారు. గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్‌లో పారదర్శకతకు పాతర వేసి ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రస్తుతం పదోన్నతుల కౌన్సెలింగ్ పూర్తయి వారం రోజులైనప్పటికీ పదోన్నతుల పోస్టింగ్ పొందిన వారికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వడం లేదు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారులు పదోన్నతులు పొందిన గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంల నుండి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వడానికి పెద్ద ఎత్తున డబ్బులు అడుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ పూర్తయి వారికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చి వారు వెళ్ళి జాయిన్ అయి తిరిగి పాత స్థానాల్లో వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. అయితే మన జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ఎఎన్ఎంలుగా విధులు నిర్వర్తించి పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరై పోస్టింగ్ పొందిన వారికి మాత్రం ఇప్పటి వరకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వని పరిస్థితి నెలకొంది. గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా వున్న ఎఎన్ఎంలుగా పదోన్నతులు పొందడానికి 298 గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలను ఎంపిక చేశారు. వీరిని ఈ నెల 11, 12వ తేదీల్లో కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక హాలులో డిఆర్ఓ ఆధ్వర్యంలో పదోన్నతుల పోస్టింగ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారులు పదోన్నతుల కౌన్సెలింగ్‌లో సాక్ష్యాత్తు జిల్లా రెవెన్యూ అధికారి వుండగానే పలువురు అభ్యర్థులను మభ్యపెట్టి సమీపంలో వున్న ఖాళీలను చూపకుండా దూర ప్రాంతాల్లో వున్న ఖాళీలను చూపి అన్యాయం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. రెండవ రోజు జరిగిన ఎఎన్ఎంల పదోన్నతుల పోస్టింగ్ కౌన్సెలింగ్‌లో సైతం ఇదే పద్ధతిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారులు కొనసాగిస్తే డిఆర్ఓకు అనుమానం వచ్చి చివరి 28 గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎం పదోన్నతుల పోస్టింగ్స్‌లో అక్రమాలు జరిగాయని నిర్ణయించి వీరికి మాత్రం 13వ తేదీ పోస్టింగ్ కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే అప్పటికే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారుల తీరు వల్ల సుమారు 50 నుండి 70 మంది అర్హులైన గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలు వారు కోరుకోవాల్సిన ప్రదేశాలు కొల్పోయి తీరని అన్యాయానికి గురయ్యారు. ఏ రోజు జరిగిన పదోన్నతుల పోస్టింగ్ కౌన్సెలింగ్‌కు సంబంధించి అదే రోజు సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసి పోస్టింగ్ పొందిన అభ్యర్థులకు ఇచ్చే అవకాశం వున్నప్పటికీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారులు ఇలా చేయలేదు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంల పదోన్నతుల పోస్టింగ్ కౌన్సెలింగ్ పూర్తయి వారం రోజులు అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు వారికి ఉత్తర్వులు ఇవ్వలేదు. దీనికి కారణం తమకు ఎలాంటి లాభం లేకుండా పదోన్నతుల పొందిన గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తే ఎలాగని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారులు స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు పదోన్నతులు పొందిన గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలకు నేరుగా పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వకుండా సంబంధిత పిహెచ్‌సి యుడిసిలకు ఎఎన్ఎంల పదోన్నతుల పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చి వారి నుండి యుడిసిలు సొమ్ములు వసూలు చేసి డిఎంహెచ్ఓ కార్యాలయ అధికారులకు ఇచ్చేలా వ్యూహం రచించినట్లు తెలిసింది. అయితే జిల్లా అధికారులు మాత్రం గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారులు వారికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చి వుంటారని భావించినట్లు తెలిసింది.

మూడు పోలీస్ స్టేషన్లకు ఒకే ఒక్కడు

చిత్తూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పరిధిలోని మూడు పోలీస్ స్టేషన్లకు ప్రస్తుతం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఇటీవల మహేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో చిత్తూరు టుటౌన్ ఇన్స్పెక్టర్ ఆదివారం వరకు సెలవు పెట్టడంతో అప్పటి వరకు వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్‌గా ఇన్‌ఛార్జీ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యలు అప్పగించారు. అలాగే చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ సెలవుపై వెళ్ళడంతో చిత్తూరు మహిళా స్టేషన్ ఇన్‌ఛార్జీ ఇన్స్పెక్టర్‌గా వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ బాధ్యతలు తీసుకున్నారు. ఇలా చిత్తూరు నగరంలోని మూడు పోలీస్ స్టేషన్లకు ప్రస్తుతం చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

టిటిడి ఈఓను కలసిన గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్

పలమనేరు,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:

పలమనేరు తిరుపతి గంగమ్మ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీధర్ గురువారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో ఈఓ శ్యామలరావును కలవడం జరిగింది. మే నెలలో పలమనేరులో గంగమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తునట్లు ప్రతి ఏటా లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మెక్కులను తీర్చుకుంటున్నారని ఈ ఏడాది నిర్వహించే జాతరకు టిటిడి సహాయ సహకారాలు అందించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి మాజీ చైర్మన్ అమ్ములు,టిడిపి నాయకులు కుట్టి,జగన్,అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

-ఎంపిడిఓ సురేష్

గంగవరం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని గంగవరం మండల ఎంపిడిఓ సురేష్ తెలిపారు. గురువారం మండలంలో స్వచ్ఛ ఆంధ్ర పారిశుధ్య పనులలో భాగంగా గంగవరం పంచాయితీలోని డ్రైవర్స్ కాలనీలో చెత్త దిబ్బలను,మట్టి దిబ్బలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నానాటికి పెరిగిపోతున్న కాలుష్యాన్ని,దోమల నివారణకు తగ్గించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఇంటి పరిసరప్రాంతాలలో వ్యర్థాల నిలువలను తొలగించాలని లేకుంటే కాలుష్యంతో పాటు దోమలు వృద్ధి చెందుతుందని దీంతో ప్రజలకు అనేక రోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సుధాకర్ రావు,సర్పంచ్ చంద్రమ్మ,డ్రైవర్స్ కాలనీ టిడిపి ఇన్‌చార్జ్,బాలాజీ సూపర్ బజార్ డైరెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సర్వేలో పాల్గొనండి

సదుం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరు గంజాయి సర్వేల పాల్గొనాలని సదుం ఎస్సై షేక్షావలి అన్నారు. గురువారం సదంలో ప్రభుత్వం అందజేసినటువంటి క్యూఆర్ కోడ్ స్కానర్ను పలుచోట్ల అతికించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ స్కానర్ ఉపయోగించి గాంజా గురించి మండలంలోని మీ అభిప్రాయాన్ని కలపాలని చెప్పారు. అదేవిధంగా గంజా పై పోలీసులు నిర్వహించే దాడుల గురించి అడగడం జరుగుతుందని దానికి మీరు ఈ స్కానర్ ద్వారా తెలపాలని కోరారు. ఈ స్కానర్‌లను బస్టాండ్‌లోను బ్యాంకుల దగ్గర మరియు పబ్లిక్ రద్దీ ఉన్నటువంటి ప్రదేశాలలో అతికించినట్లు చెప్పారు.

క్రీడాకారుల నుండి పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

చిత్తూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అందించే అత్యున్నత పద్మ పురస్కారాలకై 2026 సంవత్సరానికి పద్మభూషణ్, పద్మవిభూషణ్, పద్మశ్రీ అవార్డుల కోసం అంతర్జాతీయ క్రీడల్లో అత్యున్నత ప్రతిభపాఠవాలు ప్రదర్శించిన క్రీడాకారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి ఎ.బాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులు ఈ అవార్డుల కోసం వ్యక్తిగతంగా దరఖాస్తులు చేసుకోవచ్చునని, ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందిన అర్హత గల క్రీడాకారుల జాబితాను కేంద్ర ప్రభుత్వ సిఫార్సు కోసం పంపడం జరుగుతుందన్నారు.

భూరీసర్వేపై అవగాహన అవసరం

వెదురుకుప్పం,ఏప్రిల్ 17 ప్రభాతవార్త :

భూ రీసర్వేపై రైతులకు అవగాహన అవసరంమని డిప్యూటి తహశీల్దారు కోమల అన్నారు. మండలంలోని అగ్గిచేనుపల్లి పంచాయితీ పరిధిలో గురువారం భూ రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించినారు. ఈసం దర్భంగా ఆమె మాట్లాడుతూ రెవన్యూ సమస్యలను శాస్వతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం భూరీసర్వే కార్యక్రమం చేపట్టిదన్నారు. రైతులు అవగాహ నతో రీసర్వే బ్రుందాలకు సహకరించటంతో మెరుగైన సర్వే నిర్వహించడానికి వీలువుతుందని చెప్పారు. రైతులు తమ వివరాలను రెవిన్యూ సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు. విఆర్ఓ సాంబాశివారెడ్డి మాజీ సర్పంచ్ రాజారెడ్డి,స్థానిక నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, బుజ్జిబాబు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే...

రేణిగుంట ఏప్రిల్ 17 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామానికి చెందిన గ్రామ ప్రముఖుడు శంకర్ రెడ్డి పార్థివ దేహాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గురువారం సందర్శించి ఆయనకు ఘనంగా నివా ళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్చారు. ఎమ్మెల్యేతో పాటు రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్ర రెడ్డి ఉన్నారు.

అన్నదానం

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త ః

స్థానిక పళని థియేటర్ సమీపంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఆనందయాదవ్ పుట్టిన రోజు సందర్భాన్ని పురస్కరించుకుని తులసి యాదవ్ యూత్ ఆధ్వర్యంలో బీసీ నేత కృష్ణయాదవ్ హాజరై పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వార్డు.. బూత్ ఇన్‌చార్జ్‌ల ఎన్నిక

కుప్పం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ మొదలైన విషయం విదితమే. గురువారం మున్సిపల్ పరిధి ఒకటి, రెండో వార్డుల్లో వార్డు మరియు బూత్ ఇన్‌చార్జ్‌లను మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ సమక్షంలో ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు నూతన కమిటీ నేతలు పార్టీ బలోపేతానికి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, ప్రధాన కార్యదరి ్శ ఆర్కుగం, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, రాష్ట్ర నేత కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్ సెల్వరాజ్, మాజీ సర్పంచ్ సురేష్, నాగేంద్ర, మహిళా నేత భాగ్యలక్ష్మి త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర వాట్సప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

శాంతిపురం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన మనమిత్ర వాట్సప్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ కోరారు. గురు వారం సాతు గ్రామంలో వాట్సప్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం 161 సేవలను 9552300009 నెంబరుతో వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తుందన్నారు. విద్య, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు తదితర సేవలు లభిస్తాయన్నారు. స్మార్ట్‌ఫోన్ కలిగిన వారు ఈసేవలను ఉచితంగా పొందవచ్చున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి స్వాతి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో జోరుగా మందుల పిచికారీ

కుప్పం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

వేసవి దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు చొరవతో కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో మందుల పిచికారీ కార్యక్రమాన్ని మున్సిపల కార్మికులు జోరుగా చేపడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపేట, చిన్నకురబలపల్లి, కుప్పం పట్టణంలోని పలుప్రాంతాల్లో కాలువల్లో దోమలు నిల్వ లేకుండా మందులు పిచికారీ చేస్తున్నారు. అలాగే నీరు నిల్వ ఉన్న చోట సైతం మందులను పిచికారీ చేస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రజల ఆరోగ్యంకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రజలు కూడా ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని ఆయన సూచించారు.

జనారణ్యంలో వచ్చిన దుప్పి

వి.కోట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

ఆహారాన్వేషణలో భాగంగా గురువారం ఓ దుప్పి జనారణ్యంలో వచ్చింది. అనంతరం గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. మండలంలోని గెస్తింపల్లిలో ఓ దుప్పి ప్రవేశించడంతో గ్రామస్తులు పోలీసులు, అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకుని దుప్పికి వైద్య పరీక్షలు నిర్వహించి సమీప అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

ఘనంగా శ్రీ పెద్దపల్లి గంగమాంబ ఉత్సవం

కుప్పంరూరల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

కుప్పం కొత్తపేటలో వెలసిన శ్రీ పెద్దపల్లి గంగమా ంబ అమ్మవారి జాతర ఘనంగా జరుగుతోంది. అమ్మవారి ఉత్సవాన్ని ఉదయం, రాత్రి పురవీధుల్లో వివిధ వాహనాలపై ఊరేగించారు. భక్తులు ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయం వద్ద భక్తులకు ఆలయ ధర్మకర్త శివకుమార్, కార్యదర్శి వెంకటేష్‌లు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 19న అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, 20న అమ్మవారికి మహిళల పొంగళ్ల సమర్పణతో జాతర ముగుస్తుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- తహసిల్దార్ల సమీక్షలో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

రెవెన్యూ సమస్యల పరిష్కరించడానికి తహసిల్దార్లు ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ మోహన్‌కుమార్‌లతో కలిసి ఆర్డీఓలు, స్పెషల్ డిప్యుటీ కలెక్టర్లు, తహసిల్దార్లతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి తహసిల్దార్లు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, మ్యుటేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే పట్టా లేని భూమికి అనుభవ పత్రం కల్గిన వారికి, ప్రభుత్వ భూమి రెగ్యులరైజేషన్ చేసుకోవడానికి ప్రభుత్వం జిఓనెం.30 జారీ చేసిందని, ఈ ఉత్తర్వుల మేరకు పట్టా లేని భూములను 2025 డిసెంబర్ నెలాఖరులోపు క్రమబద్ధీకరణకు అవ కావం కల్పించిందన్నారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించి వారు దీనిని సద్వినియోగం చేసు కొనేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఆర్ఓఆర్ సమస్యలు పరిష్కారానికి ఆర్డీఓలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆర్డీఓలు, డిప్యుటీ కలెక్టర్లు వారికి కేటాయించిన మండలాల్లో భూఅలినేషన్, అసైన్‌మెంట్‌భూమి, రెగ్యులరైజేషన్, ఆర్ఓఆర్, 22 ఎ, వెబ్ లాండింగ్, రీసర్వే సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. ఈ వర్క్‌షాపులో చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, పలమనేరు ఆర్డీఓ భవానీ, నగరి ఆర్డీఓ భవానీ శంకరీ, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి

- ఎంఈఓ గోపాల్ రెడ్డి

పెద్దపంజాణి ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

విద్యార్థులు క్రమశిక్షణతో ఒక్కక్కస్థాయికి ఎదగాలని ఎంఈఓ గోపాల్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ముత్తుకూరు ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ.. ప్రతివిద్యార్థికి జ్ఞానం విద్యద్వారా లభిస్తుందన్నారు. విద్యార్థులు బాగాచదువుకుని ఉన్నతస్థాయికి ఎద గాలని సూచించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు బాబూరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదిగినప్పుడే భవిష్యత్తు బంగారుబాట అవుతుందన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, డివిజినల్ కన్వీనర్ నారాయణస్వామి, సిఆర్‌సిహెచ్ఎంచంద్రయ్య, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శకుంతల, వసంత, ఆర్థిక కార్యదర్శిశివప్రకాష్‌బాబు, బయ్యన్న, లక్ష్మీపతి, శ్రీనివాసులు, ఉష, నీరజ, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

చౌడేపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి-తిరుపతి ప్రధాన రహదారిలో కడియాలకుంట ఆంజనేయస్వామి ఆలయం మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో బెంగళూరుకు చెందిన వేణుగోపాల్(55), మండలంలోని లద్దిగం రెడ్డెప్ప (57), షఫీ(35)లకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానిక పోలీసులు 108సేవల ద్వారా పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా రోడ్డు ప్రమాదం సంభవించిన దాదాపు గంట ఆలస్యంగా 108వాహనం రాకపోవడంతో వారికి సీనియర్ జర్నలిస్టు కడియాల మహేష్‌బాబు ప్రథమ చికిత్స చేసాడు.

సమస్యల సాధనకై ఆయుస్మాన్ సిహెచ్ఓల నిరసన

చౌడేపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయుస్మాన్ సిహెచ్ఓలు తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా మండలంలోని సిహెచ్ ఓలు స్థానిక ఆరోగ్య కేంద్రం ఎదుట శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సిహెచ్ఓలుగా పనిచేస్తున్న తామ గత రెండేళ్ళుగా జీతాల చెల్లింపుల్లో సమస్యలు పడుతున్నామన్నారు. ఆయుస్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలనీ, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఇపిఎఫ్‌ను పునరుద్ధరించి నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలన్నారు. తమ న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాని కోరుతూ వైద్యాధికారి పవన్‌కుమార్‌కు వినతి పత్రమందించారు. రాష్ట్ర పిలుపు మేరకు ఆన్‌లైన్‌ఆధారిత సేవలను గురువారం నిలిపి వేశారు. మండలంలోని 14మంది సిహెచ్ఓలు పాల్గొన్నారు.

కరెంట్ తీగలపై రాగి చెట్టు కొమ్మలు

- పట్టించుకోని ట్రాన్స్కో అధికారులు

పూతలపట్టు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త



పూతలపట్టు మండలం పి. కొత్తకోట గ్రామం, పి . కొత్తకోట రైతు భరోసా కేంద్రం వద్ద కరెంటు తీగలపై రాగి చెట్టు కొమ్మలు కరెంటు తీగలపై ఉండడంతో అకాల వర్షాలకు వచ్చే ఈదురు గాలులకు కరెంటు తీగలు పై చెట్టు కొమ్మలు పడటం సమీపంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ ఫీజులు ఎగిరిపోవడం వల్ల స్థానిక ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. చాలాసార్లు లైన్ మాన్ లకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోవడంతో ట్రాన్స్కో అధికారులైన కరెంటు తీగలపై ఉన్న చెట్టు కొమ్మలను తీసివేయాల్సిందిగా స్థానిక ప్రజల అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత ట్రాన్స్కో అధికారులపై ఉందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

టౌన్ సిఐగా సుబ్బారాయుడు

పుంగనూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బి.సుబ్బారాయుడు గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. గతంలో టాస్క్ ఫోర్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. పుంగనూరు పట్టణ, మండల పరిసరాల ప్రాంతాల్లో నేరాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పద్మవిభూషణ్. పద్మభూషణ్ పద్మశ్రీ అవార్డుల కొరకు ధరఖాస్తులు

చిత్తూరురూరల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అత్యున్నత ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన క్రీడాకారులకు అందజేసే, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డుల కొరకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎ బాలాజీ ఒక ప్రకటనలో కోరారు. మే నెల 26వ తేది సాయంత్రం 5గంటల లోపు రాష్ట్ర క్రీడాకార సంస్థ మెయిల్ sportsinap@gmail.comకు పంపిన యెడల అర్హత గల క్రీడాకారుల జాబితాను కేంద్రప్రభుత్వానికి సిఫారసు కోసం పంపుతామని పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో ప్రతిభ పాఠవాలు చూపుతున్న క్రీడాకారులు తగిన గుర్తింపు కొరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాలాజీ కోరారు.

అగస్త్య ఫౌండేషన్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన

కుప్పం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కుప్పం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. కుప్పం ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ అధ్వర్యంలో సిబ్బంది గ్యాస్, ఆయిల్ ప్రమాదాలు, ప్రమాదాల్లో చిక్కుకున్న సమయంలో వారిని రక్షించేలా డెమో రూపంలో చేసి చూపించారు. అనంతరం కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది మోహన్, జయకుమార్, నరేష్, కృష్ణయ్య, రామూర్తి, విజయ, రఘుపతి, మణి పాల్గొన్నారు.

ప్లకార్డులతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

కుప్పం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఎన్ఎంయుఎ డిపో అధ్యక్ష,కార్యదర్శులు మునసా ్వమి, జయపాల్ అధ్వర్యంలో ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 1/2019 భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు డబుల్ డ్యూటీ నగదు పెంచాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. అక్రమ సస్పెన్షన్లను ఆపాలన్నారు. నాలుగేళ్లుగా ఆగిన ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ లేదా ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కార్యదర్శి మునెప్ప, నేతలు రమణ, కుమార్, నారాయణ, శ్రీనివాసులు, నవీన్, బాలకృష్ణ, ప్రసన్న, దిలీప్, రహంతుల్లా, జయశంకర్, అరుణ్, రామచంద్ర, మోహన్, చంద్రనాయక్, వెంకటయ్య, రమణ పాల్గొన్నారు.

ఇండియా నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ ఫైనల్ ఫలితాల్లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థి

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

దేశవ్యాప్తంగా నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ ఫైనల్ ఫలితాల్లో పుత్తూరు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు మరోమారు తమ సత్తాను చాటారు. 6వ తరగతి విద్యార్థిని యోగశ్రీ ల్యాబ్‌టాబ్ గ్రాండ్‌ఫ్రైజ్, 4వ తరగతి విద్యార్థి వెంకటేశ్వరరావ్ ట్యాబ్‌ను ప్రథమ బహుమతిగా పుత్తూరు మండలవిద్యాశాఖ అధికారి బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. పాఠశాల విజయం సురేష్ విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపి విద్యారంగంలో శ్రీ చైతన్య విద్యార్థులు మరోమారు తమ సత్తాను చాటి తమ ప్రతిభను నిరూపించుకున్నారని తమ సంతోషాన్ని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శరవణ, డీన్ మోహన్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి వరదారెడ్డి తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆహార పదార్థాల కల్తీని ఆపండి

పాకాల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

పాకాల మండలంలో ఆహార పదార్థాలు కల్తీ విపరీతంగా పెరిగి పోతూ వున్నది. దీనికి తోడు మండలంలో టీ స్టాల్ నుంచి టిఫిన్ సెంటర్‌ల వరకు ప్లాస్టిక్ కవర్ల మీద ఇడ్లీలు ఉడికించడం వాటిని కవర్లపై వడ్డించడం అవి తిన్నవారు అనారోగ్యాల పాలవుతూ ఉండడం. ముఖ్యంగా హోటల్స్, బేకరీలు, ఫ్రై సెంటర్స్‌లో ఎక్కువగా కల్తీ పదార్థాలు విక్రయిస్తు వున్నారు. అవి తిన్నవారికి జీర్ణావస్థలో మార్పులు వచ్చి జీర్ణాశయం దెబ్బతినడం, ఆల్సర్స్, కాలేయ వ్యాధులు సంభవించి దీర్ఘకాలిక రోగాలకు గురవుతూ ఉన్నారు. సంబంధిత ఫూడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు లేకపోవడం వల్లవారు ఇష్టానుసారం పదార్థాలు తయారు చేసి విక్రయిస్తువున్నారు. అలాగే డిస్పోజిబుల్ ప్లాస్టిక్ కవర్ ప్లస్టిక్ గ్లాస్ తయారీ చేసే యూనిటీస్ గుర్తించి వారి నుంచి కవర్ ఉత్పత్తి ఆపి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందుతున్నాయి.

వేసవి శిక్షణా శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి క్రీడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడ వారి ఆదేశాల మేరకు వేసవి శిక్షణా శిభిరంలో మే 1 నుండి 31 వరకు 8 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలకు వేసవి సెలవులలో క్రీడా శిక్షణ కార్యక్రమంలో ఎక్కువ మందిని ప్రోత్సహించేందుకు ఈ అవకాశం కల్పించినట్లు డిఎస్‌డిఓ సయ్యద్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 - 26 సంవత్సరానికి పట్టణ, గ్రామీణ ప్రాంతంలో 50 సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించామని శాప్ నుండి ఆదేశాలిచ్చారన్నారు. అందువల్ల జ

తిరుపతి డివిజన్

వాటర్‌వర్క్స్ కాలనీలో పోలీసుల పల్లెనిద్ర

-చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ

.శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని వాటర్ వర్క్స్ కాలనీలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడ నివాసం ఉంటున్న ప్రాంతంలో అర్బన్ సిఐ డి.గోపి ఆధ్వర్యంలో ప్రజలతో మాటామంతి కార్యక్రమాన్ని నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అంతేకాకుండా పోలీసుల యొక్క సేవలను ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా కొత్తగా ఏర్పడిన చట్టాల గురించి, సైబర్ క్రైం, చిన్నారులు మరియు వమిళల పట్లజరిగే నేరాల గురించి వారికి అవగాహన కల్పించారు. అంతేకాకుండా ఆప్రాంతంలో ఉన్నటువంటి చదువుకునే విద్యార్థులైన చిన్నారులకు పోలీసుశాఖ తరపున పుస్తకాలు, పెన్నులు ఇతర విద్యాసామగ్రి పంపిణీచేశారు. పేదరికాన్ని విద్య ఒక్కటే దూరం చేస్తుందని ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డలను బడికి పంపి చదివించాలన్నారు. నేటి కంప్యూటర్ యుగంలో విద్య ప్రతి ఒక్కరికి అవసరమని నేడు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందుతోందన్నారు. తల్లిదండ్రులు పనికి, బిడ్డలు బడికి వెళ్ళాలన్నారు. అంతేకాకుండా ఎవరైనా అపరిచితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాన్నారు. చిన్నారులుకు పుస్తకాలు, పెన్నులు పంపిణీచేయడంతో వారి సంతోషానికి అవధులు లేకుండాపోయింది. కార్యక్రమంలో అర్బన్ సిఐతో పాటు, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

మహిళల ఆర్థిక స్వాలంబనకు కూటమి కృషి

ఎంఎల్ఏ సతీమణి పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొటాల, గంగుడుపల్లి పంచాయతీలలో గురువారం ఆమె మహిళలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొటాలలో ఆమె రాకను పురస్కరించుకుని టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, దొరస్వామి నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్థులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను వివరిస్తూ అందజేసిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గౌసిభాషా, సక్కుర్ ధనంజయ రెడ్డి, మల్లికమ్మ, మహేష్, రూపసుందర్ రెడ్డి, ఉషారాణి, మహేష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల కార్యదర్శిగా "సిద్ధిఖ్ భాషా"

చంద్రగిరి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శిగా చంద్రగిరికి చెందిన సిద్ధిఖ్ భాషా నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ నాయకత్వం నుండి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పట్ల క్రమశిక్షణతో తాను చేసిన సేవలకు తగిన గుర్తింపును ఇస్తూ మండల కమిటీలో కార్యదర్శిగా స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి, వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.

వైసిపి వాలంటీర్స్ విభాగం మండల అధ్యక్షుడుగా "సూరి"

చంద్రగిరి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాలంటీర్స్ విభాగం మండల అధ్యక్షుడుగా మల్లయ్యపల్లికి చెందిన సూరి నియమితులయ్యారు. ఆ మేరకు గురువారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నియామ కపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూరి తనపై నమ్మకంతో వాలంటీర్స్ విభాగానికి అధ్యక్షుడుగా నియమించడం పట్ల మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా తన అభిమాన నాయకుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని దుశ్శాలువతో ఘనంగా సన్మానించి, ధన్యవాదాలు తెలియజేశారు. వాలంటీర్స్‌ను సుశిక్షితులైన కార్యకర్త లుగా తీర్చిదిద్దుతానని అన్నారు. పార్టీ బలోపేతానికి వాలంటీర్స్ పట్టుకొమ్మలుగా దోహదపడగలరన్నారు.

అమరలో లాప్రోస్కోపీ విప్పల్ శస్త్ర చికిత్స సక్సెస్....

రేణిగుంట ఏప్రిల్ 17 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆసుపత్రి నందు విపరీతమైన కడుపు నొప్పి, కామెర్లతో బాధపడుతున్న 60 సంవత్సరాల వయసున్న మునికృష్ణయ్యకు అమర వైద్యులు ఎంతో శ్రమించి అతికిష్టమైన శస్త్ర చికిత్సను గ్యాస్ట్రో ఎంటరాలజీ ద్వారా సక్సెస్ ఫుల్ గా నిర్వహించారు. మునికృష్ణయ్యకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నప్పుడు వైద్యులు ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. ఈ దశలో శస్త్ర చికిత్స చేయడం ఎంతో క్లిష్టమైనది గా అభివర్ణించారు. అయితే అమర వైద్యులు ఛాలెంజ్ గా తీసుకొని శస్త్ర చికిత్స విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ గొరినేని, మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గొరినేని మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న వైద్యులు ఎంతో అనుభవం కలిగిన వారన్నారు. ఆపరేషన్ సక్సెస్ చేసిన వైద్య బృందాన్ని అనస్తీసియన్ డాక్టర్ రాకేష్ ను అభినందించారు.

మళ్ళీ నేతి దీపాలపై కన్నెర్ర

వ్యాపారులు లబోదిబో

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 17 ప్రభాతవార్త

సాధారణంగా భక్తుల మనోభావాలెలా ఉంటాయంటే 'శివుని సన్నిధిలో దీపం వెలిగిస్తే' మంచిదనే భావం ఉంటుంది. అయితే పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో దీపం వెలిగిస్తే మంచిదనే అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడకు వచ్చే భక్తులు దీపాలు వెలిగించుటకు ప్రయత్నిస్తుంటారు. ఈ నేపథ్యంలో కొందరు వ్యాపారుల మధ్య పోటీ తత్వం ఏర్పడి భక్తులను మోసం చేసే విధానం కూడా కొనసాగుతుంది. అయితే గురువారం మళ్ళీ నేతి దీపాలను విక్రయించే వ్యాపారులపై పోలీసులు, సెక్యూరిటి కన్నెర్ర చేసినట్లు సమాచారం.

భక్తుల మనోభావాలకనుగుణంగా ఏర్పాటు చేయాలి:

శివాలయానికి వచ్చిన భక్తులు ఆలయంలో దీపం వెలిగించుటకు ప్రయత్నిస్తారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎక్కడ బడితే అక్కడ వెలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో పొగతో ఆలయాలు మసిబారిపోతున్నాయని ఆలయాధికారులు భావిస్తూ గురువారం వ్యాపారులను అమ్మరాదని హెచ్చరించారు. భక్తుల మనోభావాలను గుర్తించి ఆలయాధికారులు 'దీపాలు వెలి గించుకొనుటకు' అవకాశం కల్పించాల్సి ఉంది. కార్తీక మాసం ప్రత్యేక షెడ్డు వేసినట్లు ఆలయానికి సంబంధించిన స్థలాల్లో ఆలయాధికారులు ప్రత్యేక స్థలంను కేటాయించి అక్కడ దీపాలు వెలిగించు కొనుటకు అవకాశం కల్పించాల్సి ఉంది. అంతేకాని భక్తుల మనోభావాలకు అవరోధం కల్పించటం మంచి పద్ధతి కాదు. శబరిమలలో ప్రత్యేక ధుని ఏర్పాటు చేసారు. అలాగే షిరిడిలో ధుని ఏర్పాటు చేసారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా దీపాలు వెలిగించుటకు స్థలం కేటాయించాల్సి ఉంది. అధికారులు ఈ దిశగా పరిశీలించాల్సి ంది. లేదంటే వ్యాపారులు మళ్ళీ శాసనసభ్యుని వద్దకు వెళ్ళటం తమ బాధలను మొరబెట్టుకోవటం జరిగితే అధికారులు సందిగ్ధంలో పడక తప్పదు.

తిరుచానూరు ఎస్.ఐ సాయినాథ్ చౌదరి కానిస్టేబుల్ సునితపై చర్యలు తీసుకోండి

– జిల్లా ఎస్పీకి బాధితురాలు డిమాండ్

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : స్థానిక మంగళంలోని కృష్ణవేణి యాదవ్ కాలనీలో జరిగిన ఇళ్ళ విక్రయాల్లో కమీషన్ కోసం ఆశపడి ముందుడిన హేమలతను తిరుచానూరు పోలీసులు ఇష్టానుసారంగా కొట్టి తమకు అనుకూలమైన వాంగ్మూలం ఇవ్వాలని వేధించడం ఎంత వరకు సబబు అని వెంటనే ఎస్.ఐ సాయినాథ్ చౌదరి, మహిళా కానిస్టేబుల్ సునితపై పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత మహిళ హేమలత మాట్లాడారు. మంగళం గ్రామ పంచాయితీలో రిటైర్డ్ ఎస్.ఐ వెంకటరమణ కుమారుడు గంగాధరం వాళ్ళకి సంబంధించిన రెండు ఇళ్ళను అదే కాలనీకి సావిత్రమ్మకు ఒక ఇల్లు రూ. 21 లక్షలకు, మరో ఇల్లు 24 లక్షలకు విక్రయ పత్రం ద్వారా విక్రయించారన్నారు. అయితే తమ కుమారుడిని మోసం చేసి ఇల్లు రాయించుకున్నారని, తనకున్న పలుకుబడితో అక్కడి స్థానిక వార్డు మెంబరు ప్రమేయంతో తిరుచానూరు పోలీస్టేషన్‌కు కమిషన్ కోసం ఆశపడి హేమలతను రోడ్డులో నడుచుకొని వెళుతుండగా పోలీసులు దౌర్జన్యంగా జీపులో తీసుకెళ్ళి ఇష్టానుసారంగా కొట్టి చిత్ర హింసలకు గురి చేశారన్నారు. వెంటనే ఎస్.ఐ సాయినాథ్ చౌదరి, మహిళా కానిస్టేబుల్ సునీతపై పోలీసులు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు హేమలత తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి, నాగమ్మ, సుజాత, లత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి హస్తి ప్రభాకర్‌రాజు

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి హస్తి ప్రభాకర్‌రాజు అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. పుత్తూరు డిప్యూటీ డిఇఓగా, నారాయణవనం-1 ఎంఇఓగా పని చేస్తున్న హెచ్ ప్రభాకర్‌రాజు ఈ నెల 30వ తేది పదవీ విరమణ పొందనున్నారు. అప్పట్లో వేసవి సెలవుల కారణంగా ముందుగానే అనగా గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ సన్మాన సభ కార్యక్రమం జరిగింది. ఇంచార్జ్ ఎంపిడిఓ గుణశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, చిత్తూరు సోషియల్ వెల్ఫార్ డిడి చెన్నయ్య, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, తహశీల్దారు జయరాములు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పట్ల ప్రభాకర్‌రాజుకు ఉన్న నిబద్ధత అందరిని గుర్తు చేస్తుందన్నారు. ఆయన విద్యా వ్యవస్థకు చేసిన సేవలను గుర్తించి ఆయన అడుగు జాడల్లో మిగిలిన టీచర్లు నడవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గోవిందస్వామి, ఆర్‌డి ఏకాంబరం, అపరంజిరాజు, చిన్నదొరై, సర్పంచ్ శారదమ్మ గణేషన్, ఎంఇఒ జనార్ధన్‌రాజు, ఇఒపిఆర్‌డి వేణయ్య, ఇఒ టిపి షణ్ముగం, ఇ సొరకాయులు, పిజి ముఖేష్, శివశంకర్, ధర్మయ్య, ఎంఇఒలు బాబయ్య, తిరుమలయ్య, రవిశంకర్, ఉపాధ్యాయులు అందరు పాల్గొన్నారు.

నన్ను మోసం చేసి నాపై క్రిమినల్ కేసు పెట్టారు

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :

భూమిని అమ్మి అందులో వచ్చిన వాటాల పంపకాలలో వచ్చిన తేడాలతోనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ నిందలు మోపుతున్నారని బాధితుడు మురళీధర్‌రెడ్డ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు మురళీధర్‌రెడ్డి మాట్లాడారు. 2023లో ప్రదీప్, కృష్ణచైతన్య యాదవ్ అనే వ్యక్తులు తన వద్దకు వచ్చి తిరుపతి రూరల్ పోలీస్టేషన్ పరిధిలో ఎమ్మార్‌పల్లిలో మంచి స్థలం ఉందని చెప్పడంతో తాను కూడా అన్ని పరిశీలించి బ్యాంకు లోనుకు దరఖాస్తు చేసుకుని ప్రదీప్ పేరుపై రిజిస్ట్రర్ సేల్ డీడ్ ఉన్న భూమి 60 అంకణాలు కొనుగోలు చేశానన్నారు. శ్రీదేవి అనే మహిళ తన కుమార్తె హిమవతి అసలు యజమాని నుంచి స్థలంపై జీపీఏ పొంది సదరు స్థలాన్ని ప్రదీప్ వద్ద నుంచి రెండు కోట్ల 30లక్షల రూపాయలకు కొనుగోలు చేశారన్నారు. అయితే తాను ఎవరికి ఇల్లు అమ్మలేదని శ్రీదేవి తిరగబడి నాపై రాజకీయ జోక్యంతో కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ఇకనైనా అందరూ వాస్తవాలు తెలుసుకోవవాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు క్రాంతి చైతన్య, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

అడ్వాన్సు పన్నుల వసూళ్ళలో అదికారులు పరుగులు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారులు, సిబ్బంది అడ్వాన్సు పన్ను వసూళ్ళలో పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ బియస్ గిరికుమార్ తన సిబ్బందిని పరుగులు తీయిస్తూ తాను అవకాశం ఉన్న చోట పరుగెత్తుతున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత మున్సిపాలిటికి రావాల్సిన బకాయిల వసూళ్ళపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో రెగ్యూలర్ మార్చి ఆఖరుకు వసూలు చేయాల్సిన పన్నులలో కష్ట కాలంలో కూడా 63శాతం వసూలు చేసారు. తరువాత కకూడా వడ్డీ పన్ను రాయితితోకొంత వసూలు చేసారు. ప్రస్తుతం అడ్డాన్సు పన్ను చెల్లింపు వెసులుబాటును ప్రభుత్వం మున్సిపల్ శాఖ ప్రకటించటంతో వసూళ్ళుకు పరుగులు తీస్తున్నారు. బిల్ కలెక్టర్లు ఎంతో చొరవ చూపి పన్నుల వసూళ్లకు పరుగులు తీస్తున్నారు. గతం కన్నా ప్రస్తుతం మున్సిపల్ టీంతోపాటు ఆయా వార్డుల వాలంటీర్లు కూడా జనాన్ని చైతన్యం చేస్తున్నారు. మున్సిపల్ అభివృద్ధికి పన్నుల వసూళ్ళలో పరుగులు తీస్తున్న సిబ్బందిని అభినందిస్తూ కమిషనర్ బియస్‌గిరి కుమార్ ప్రోత్సహిస్తున్నారు. సాధారణంగా ప్రతి ఏటా పివిఆర్ గ్రూప్,ఎంజిఎంలు పెద్ద మొత్తాల్లో చెల్లిస్తారు. వారి వద్దకు పరుగులు తీస్తూ వారిని చైతన్య పరుస్తున్నారు.

వీధినాటకాలతో వైసిపి కుట్ర..తెదేపా

.శ్రీకాళహస్తి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజానీకం చేతిలో చావుదెబ్బతిన్న వైసిపి నాయకులు ఎన్డీయే కూటమి ప్రభుత్వంకు వ్యతిరేకంగా వీధినాటకాలతో కుట్రలకు పాల్పడుతున్నారని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురు తెదేపా నాయకులు మాట్లాడుతూ స్వతహాగా నాస్తికుడు, హిందూ ద్వేషి అయిన కరుణాకర్‌రెడ్డిలు టిటిడిపైన గోవిందుని పైన చేస్తున్న విషపూరితమైన కుట్రలను పటాపంచలు చేయడానికి భక్తుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి గోశాల వద్దకు ఎన్డీయే కూటమి ఎంఎల్ఏలకు నాయకులకు సంఘీభావంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. జగన్ మార్గదర్శకత్వంలో ఫేక్ డ్రామాలు ఆడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి గోశాలకు వెళ్ళేందుకు అభ్యంతరంలేదని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పినప్పటికి, భూమన కుటుంబం, రోజా తదితరులు డ్రామాలు వర్ధించలేనివన్నారు. ధర్మవిరుద్ధమైన ప్రవర్తనతో గత కొన్ని రోజులుగా టిటిడి వ్యవహారాలపై అసత్య ఆరోపణలు చేస్తున్న వైసిపి వారికి గోశాలలోని వాస్తవాలను చూపెడుతామన్నారు. ఎన్డీయే కూటమి ఎంఎల్ఏలు భూమన మరియు ఇతర నాయకులను ఆహ్వానించినప్పటికి పలాయనం చిత్తగించారని ఆరోపించారు. కార్యక్రమంలో డా.దశరధాచారి, మిన్నల్‌రవి, ఉమేష్‌రావు, వజ్రంకిషోర్, రామచంద్రయ్య, మునిరెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంను ప్రారంభించిన రిషితారెడ్డి

తొట్టంబేడు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సతీమణి గురువారం ప్రారంభిం చారు. అనంతరం అక్కకు వచ్చిన మహిళలకు వేసవి తాపం తీర్చడానికి మజ్జిగ, మంచినీరును పంపిణీ చేశారు. పట్టణ టిడిపి అధ్యక్షులు విజయకుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కంటా రమేష్, మహిళాధ్యక్షురాలు సుమతి, నాయకులు వివేక్, రమేష్‌బాబు, భాస్కర్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన

.తొట్టంబేడు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ఎంజిఎం పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు కరపత్రాలను పంపిణీచేశారు. గ్యాస్ ఫైర్, ఆయిల్ ఫైర్, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగినపుడు అగ్నిప్రమాదాల నివారణ చర్యల గురించి వారికి డెమె ద్వారా వివరించారు. అలాగే పై అంతస్తులో అగ్నిప్రమాదం జరిగినపుడు లేదా దట్టమైన పొగలో ఇరుక్కుపోయినపుడువారిని ఏవిధంగా రెస్కూ చేయాలో ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అగ్నిమాపకాధికారి పి.నాగార్జునరెడ్డి, మరియు సిబ్బంది తిరుమలరెడ్డి, సునీల్, అమర్నాథ్, ధనశేఖర్, రాజ, మునిశేఖర్, రంజిత్‌కుమార్, మహేశ్వరరెడ్డి, విజయకుమార్, మరియు ఎంజిఎం డైరెక్టర్ మయూర్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వేసవి వినోదాన్ని అందించిన ప్రేరణ హెల్పింగ్ సొసైటీ.

తిరుపతి విద్య ఏప్రిల్ 17 ప్రభాత వార్త

తిరుపతికి చెందిన ప్రేరణ హెల్పింగ్ సొసైటీ వారి నెలవారి ఈవెంట్లలో భాగంగా గురువారం నాడు రాస్,అక్షయక్షేత్రం లోని సుమారు 65 మంది చిన్నారులను చంద్రగిరి దగ్గరలోని ఖిఖ్లు ల్యాండ్ వాటర్ పార్క్‌కికు తీసుకొని వెళ్ళటం జరిగింది. ఈ సందర్భంగా ప్రేరణ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పి.గణేష్ మాట్లాడుతూ,చిన్నారులు ఈ వేసవి వినోదాన్ని అమితంగా ఆస్వాదించారు అని, ప్రత్యేక ప్రతిభావంతులు అయినా వీరిని ఇలా వాటర్ పార్క్ కి తీసుకొని రావడం చాలా సంతృప్తిని ఇచ్చిందన్నారు.ప్రేరణ 18 సంవత్సరాల ప్రయాణంలో ఈ ఈవెంట్ ఒక మైలు రాయిగా నిలిచిపోతుంది అని అంటూ ఈ ఈవెంట్ కి విరాళాలు ఇచ్చిన దాతలకు,రాస్,అక్షయక్షేత్రం యాజమాన్యానానికి, వారి వంతు మద్దతు ఇచ్చిన వాటర్ పార్క్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రేరణ సభ్యులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

పుత్తూరురూరల్, నారాయణవనం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :

పుత్తూరు మండలం పరమేశ్వరమంగళంలోని శ్రీ చైతన్య పాఠశాల-2 విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల్లో తమ ప్రతిభను కనపరిచినట్టు మండల విద్యాశాఖధికారి బాలసుబ్రమణ్యం కొనియాడారు. ఐఎన్‌టిఎస్ఓ పరీక్షల్లో 6వ తరగతి విద్యార్థి ఎవై కుషల్ మరియు 5వ తరగతి విద్యార్థి జె బినోదిని ప్రథమ బహుమతులను సాధించినట్టు చెప్పారు. వీరికి లెనోవో ట్యాబ్‌లను అందించినట్టు చెప్పారు, విద్యా రంగంలో శ్రీ చైతన్య విద్యార్థులు చూపిస్తున్న ప్రతిభ పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం సురేష్, ప్రిన్సిపాల్ కె గోపి, డీన్ వినోద్‌కుమార్, సీ బ్యాచ్ ఇంచార్జ్ దివాకర్, సౌమ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిమ్మ భూపాలపురంలో భూముల సర్వే

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు భూములు ఆస్తులు పరిరక్షణలో భాగంగా తిమ్మ భూపాలపురం గ్రామ రెవెన్యూ రీ సర్వేలో భాగంగా డీటీ చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో గురువారం భూ రీసర్వే కార్యక్రమం చేపట్టడం జరిగింది. తిమ్మ భూపాలపురం భూముల రెవెన్యూ సరిహద్దులు, క్వారీల ఐడెంటిఫికేషన్ విషయాలను పరిశీలించడం జరిగింది. భూ హక్కు దారులకు చట్టబద్ధమైన హక్కులను కల్పించేందుకే భూ రీసర్వేలు నిర్వహించడం జరుగుతుందని, తమ స్వాధీనంలో ఉన్న భూముల అర్హత పత్రాలను, సాగు పత్రాలను సర్వే సమయంలో చూపించి చట్టభద్రత పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, వీఆర్‌వోలు, సర్వేలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు విద్యాభ్యాసన బంగారు భవిష్యత్తుకు బాట

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసన కొనసాగించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత విద్యాభ్యాసం అభ్యసించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసి ఉన్నత స్థాయి పొందారని ఎంఈవో రవీంద్ర నాథ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూలులో విద్యార్థుల నమోదు కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో అభ్యసన జరుగుతుందని, నాణ్యమైన విద్యాభ్యాసనతో పాటు విశాలమైన గదులు ఆట స్థలాలు ప్రభుత్వ స్కూళ్ళలో మాత్రమే లభిస్తుందని తెలిపారు. బడిఈడు పిల్లలు, బడి మానేసిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా సీఆర్పీలు ఆయా పాఠశాల పరిధిలోని ఉపాధ్యాయులు బాధ్యతగా స్కూళ్ళలో చేర్పించాలన్నారు. 3,4,5 తరగతుల విద్యార్థులు ప్రభుత్వ మోడల్ ప్రైమరీ స్కూల్లో చేర్పించేందుకు విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామసభలు

విజయపురం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. గురువారం మండలంలోని కాళికాపురం, గంగమాంబాపురం గ్రామాల్లో భూముల రీ సర్వేకి సంబంధించి ఆ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సీనియర్ నాయకుడు ముని భాస్కర్‌రాజు, రీ సర్వే డీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి బేబి రాణి, వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇసుక లోడు టిప్పర్ సీజ్

విజయపురం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:

మండల పరిధి నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ని పోలీసులు స్వాధీనం చేసుకుని విజయపురం తహసీల్ద

ఎన్‌బికెఆర్‌లో ఘనంగా ఎస్టాటికా సంబరాలు

కోట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎస్టాటికా సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండను సైతం లెక్కచేయకుండా ఆడిపాడారు. సినీ గీతాలు, మ్యూజికల్ డాన్స్, జానపద గీతాలు ఆలపించారు. సంగీతం, బృంద నృత్యం, సంగీత వాయిద్యాల పోటీ, మిమిక్రీ నాటకాలు వేసి ప్రేక్షకులను మెప్పించారు. విద్యార్థులు ఉత్సాహ భరితంగా తమలో ఉన్న కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థులు ఆడిపాడిన దృశ్యాలను సహ విద్యార్థులు కళ్లార్పకుండా వీక్షించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను చూపేందుకు ఈ ఎస్టాటికా ఒక వేదిక అని చెప్పారు. విద్యార్థులు ఇటు సాంకేతిక విద్యలో, అటు క్రీడారంగంలో, సాంస్కృతిక రంగాల్లో చక్కటి ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు.

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోవాలంటే ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసర మన్నారు. అంతకుముందు కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు వివిధ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం పలు ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

21న ఏపి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

వెంకటగిరి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: 2025-26 విద్యా సంవత్సరానికి ఏపీ మోడల్ స్కూలులో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 21న ఉదయం 10 గం. లకు వెంకటగిరి, మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్షలు జరుగుతాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డి. తులసి జ్యోతి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెంటనే తమ హాల్ టిక్కెట్లను అధికారిక వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 83330 66000 నంబరును సంపాదించాలని ఆమె కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కోట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : మండల కేంద్రమైన కోటలోని శ్రీచైతన్య స్కూలులో గురువారం అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాలల్లో మంటలు చెలరేగితే ఎలా ఆర్పాలనే అంశంపై అగ్నిమాపక శాఖ అధికారి హరీష్ వివరించారు. బ్లాంకెట్ మరియు బకెట్ మెతడ్స్ స్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల చేత చేయించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిక్, సిహెచ్ శ్రీనివాసులు, నాగరాజు, వెంకట సుబ్బయ్య, దశయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నపాలెంలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు

కోట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : మండలం వెంకన్నపాలెం, కోట-3 పరిధిలో గురువారం ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. బిపి, షుగర్ పరీక్షలతో పాటు పింక్ బస్సుల్లో మహిళలకు, పురుషులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని నియోజకవర్గ దళిత నాయకులు సమైక్యంగా తెలిపారు. గురువారం రైల్వేగేటు వద్దనున్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని ఉమ్మడి రాష్ట్రంలోనే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి ఉన్నప్పుడు శ్రీకారంచుట్టారన్నారు. అప్పట్లో జాతీయ కమిషన్‌ను సంప్రదించ లేదని హైకోర్టులో ఎస్సీ వర్గీకరణ బిల్లును కొట్టేశారన్నారు. కాగా ప్రస్తుతం సుప్రీం కోర్టు ఎస్సీల వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేపట్టవచ్చని ఇటీవల తీర్పు ఇచ్చిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రప్రభుత్వం రంజన్ మిశ్రా కమిషన్ వేసి ఆ కమిషన్ నివేదికను తెప్పించుకుని శాసనసభలో బిల్లు రూపొందించి ఎస్సీల వర్గీకరణ చేపట్టేందుకు సిద్ధమైందని దళిత నాయకులు తెలిపారు. దీంతో దళితుల్లోని అన్ని కులాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు. మాలలకు గతంలో ఉన్న రిజర్వేషన్ ఆరు శాతం కన్నా ప్రస్తుతం 7 శాతానికి పైగానే ఈ వర్గీకరణ ద్వారా లబ్ధి చేకూరుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని దళితులందరూ ఈ బిల్లును స్వాగతించాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ వారు రాజకీయ లబ్ధి కోసం చేపడుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని దళిత నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ నాయకులు కుదిరి పెంచలయ్య, జకరయ్య, బుజ్జయ్య, శ్రీనివాసులు, వెంకటస్వామి, దేగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

సూళ్లూరుపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయు ఆధ్వర్యంలో గురువారం టీ విరామ సమయంలో ప్లెకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు జిల్లా అధ్యక్షులు శేఖర్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోర్కెలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పారదర్శకమైన బదిలీలు చేపట్టాలని కోరారు. ఉద్యోగ భద్రత, అక్రమ సస్పెన్షన్లను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని కేటగిరిలలో ప్రమోషన్లు ఇవ్వాలని శేఖర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు నాయకులు రాజేష్, షాజహాన్, శ్రీను, సుబ్బయ్య, కాలేషా, శశిదర్, జానకిరామ్, మాధవ, సునీల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు నిహారిక ఎంపిక

వెంకటగిరి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రీజినల్ స్పోర్ట్స్ మీట్ రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో సెంట్రల్ స్కూల్ విద్యార్థిని రంగినేని నిహారిక ఐదు పాయింట్లకు గాను 3.5 పాయింట్లు సాధించి నాలుగవ స్థానంలో నిలిచి నేషనల్ లెవెల్ పోటీలకు ఎంపిక అయ్యింది. ఈపోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లాలనుండి విద్యార్థిని, విద్యార్థులు హాజరు అయ్యారు. వెంకటగిరిలోని కేంద్ర విద్యాలయంలో నిహారిక చదువుతోంది. వెంకటగిరి విజయ్ చెస్ అకాడమీలో చెస్‌లో శిక్షణ పొందింది. చెస్ అకాడమీ నిర్వాహకులు నర్రా విజయ్ కుమార్ బాలికను అభినందించారు.

రోగులకు పండ్లు పాలు పంపిణీ

వాకాడు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: వైఎస్ఆర్సిపి రాష్ట్ర సిజిసి సభ్యులు నేదురుమల్లి పద్మనాభరెడ్డి 94 జయంతి సందర్భంగా మండల వైఎస్ఆర్సిపి కమిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పాలు పంపిణీ చేశారు. వాకాడు లోని నేదురుమల్లి నివాసంలో పద్మనాభరెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు, ఈ సందర్భంగా మండల వైఎస్ఆర్సిపి పెళ్లూరు కోటీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పద్మనాభరెడ్డి లేని లోటు పార్టీకి తీరనిలోటు అని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పాలు పంపిణీ చేశారు. ప్రధానవైద్యాధికారి రోహిత్ జేమ్స్, వైఎస్ఆర్ సీపీ నాయకులు నెల్లూరు పెంచల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

చిల్లకూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గవర్నమెంట్ ఆయుర్వేదిక్ డిస్పెన్సరి వైద్యాధికారి డాక్టర్ శేఖర్ కలపాటి గురువారం చిల్లకూరు మండలంలోని మోమిడి గ్రామం లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు, గర్భవతులకి ప్రసూతులకు పోషక విలువలు, పాటించ వలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు శిశువులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవికాలంలో నీటిని కాచి చల్లార్చి తీసుకోవాలని మజ్జిగ, చెరుకు రసం లాంటివి తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో డిస్పెన్సరీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్, అయాలు పాల్గొన్నారు.

రక్షణ కోసం డిఎస్పీని ఆశ్రయించిన ప్రేమ జంట

గూడూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : డిఎస్పి గీతా కుమారిని ఓ ప్రేమ జంట గురువారం ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి. తెనాలికి చెందిన విజయలక్ష్మి, చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన ఆదిల్ బాషా ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరూ శ్రీ సిటీలో పనిచేస్తుండగా ఏర్పడ్డ పరిచయంతో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు మతాలు వేరుకోవడంతో పెద్దల నుండి రక్షణ కోరి ప్రేమ జంట డిఎస్పి గీతా కుమారిని ఆశ్రయించారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

నాయుడుపేట ఏప్రిల్ 17 ప్రభాతవార్త : పట్టణంలోని నారాయణ స్కూల్ విద్యార్థులకు అగ్నిమాపక అధికారి రమణయ్య గురువారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రమణయ్య మాట్లడుతూ అగ్నిమాపక వారోత్సవాలు ఏప్రిల్ 14నుండి 21వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగివుండాలని సూచించారు. ప్రమాదాలను ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశాలపై పలుసూచనలు, సలహాలు తెలియజేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు విన్యాసాలు చేసి చూపించారు. ఈకార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ సెన్సెస్‌పై జాతీయ సదస్సు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీగోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజుల పాటు ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ సెన్సెస్‌పై జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్‌లో సాంకేతికతపై ఎటు వంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు. ప్రస్తుత దశలో భవిష్యత్‌లో విలువైన సమాచారాన్ని అందించేందుకు ఎటువంటి కార్యాచరణ రూపొందించాలనే అంశంపై కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఎన్‌టియు డైరెక్టర్ ఈశ్వరరెడ్డి కీనోట్ స్పీకర్‌గా డాక్టర్ ఆర్.రమణారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సుకు తెలంగాణ తమిళనాడు, మన రాష్ట్రం నుంచి 50 మందికి పైగా పరిశోధనలకు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థిన్స్, అడ్వాన్స్ మెటీరియల్, గ్రీన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇన్నోవేషన్‌పై ప్రసంగాలు, ప్రజంటేషన్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు సదస్సుకు హాజరైన ప్రతినిధులు గోకులకృష్ణ యాజమాన్యాన్ని అభినందించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కోట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : మేజర్ పంచాయతీ కోటలోని ఎన్‌సిఆర్ నగర్‌లో ఈ నెల 10న సోలా ప్రమీల చేతి గాజులను చోరీ చేసిన నిందితుడు నిజమాల సంపత్‌కుమార్‌ను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ చెప్పారు. ఆ మేరకు నిందితుడి నుంచి సుమారు 2 లక్షల 90 వేల రూపాయలు విలువైన 5 సవర్ల బంగారు గాజులను రికవరీ చేశారు. ప్రమీల ఎన్‌సిఆర్ నగర్‌లో నివాసం ఉంటుంది. ఆమె మూడేళ్ల నుంచి డయాబెటిస్ కారణంగా ఏర్పడిన గాయాలకు అపోలోలో డయాగ్నసిక్ సెంటర్‌లో పనిచేస్తున్న నిజమాల సంపత్‌కుమార్ చేత ఇంటి వద్ద చికిత్స చేయించుకునేది. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన సంపత్‌కుమార్ ఆమె ఇంటికి వచ్చి డ్రసింగ్ చేసే క్రమంలో ఆమెకు మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో స్పృహ కోల్పోయింది. దీంతో నిందితుడు సంపత్‌కుమార్ ఆమె చేతులకు ఉన్న బంగారు గాజులను అపహరించాడు. ఆ మేరకు నిందితుడిని ఊనుగుంటపాలెం మైక్రోటవర్ కాలనీ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారంరోజుల్లోనే నిందితుడిని చాకచక్యంగా పట్టుకోవడం విశేషం.

కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు

పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ స్వామి బాబు

వెంకటగిరి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : పసు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పొదుపు మహిళలకు రుణాలు ఇస్తున్నట్లు పశు వైద్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ స్వామి బాబు తెలిపారు. వెంకటగిరి శ్రీ శక్తి భవనంలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. కిసాన్ క్రెడిట్ కార్డు ఉంటే పాడి గేదెలకు ఒకటిన్నర లక్ష రూపాయలు, పాలిచ్చే ఆవులకు లక్ష రూపాయలు రుణాలు ఇస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

10 మోడల్ లైబ్రరీ స్కూల్స్ఏర్పాటు : ఎంఈఓ

వెంకటగిరి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : మండలంలో 10 మోడల్ ప్రైమరీ స్కూల్‌లను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తోట వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాల్లో చదివిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నట్లు చెప్పారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. 60 మంది విద్యార్థులతో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కోటేశ్వరరావు, 2 ఎంఈఓ బాబయ్య, సిడిపివో శంషాద్ బేగం పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

వెంకటగిరి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ డిపో కార్యదర్శి కే.వి రత్నం కోరారు. డిపో ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు డిపో ప్రెసిడెంట్ పి.వి.రావు ఆధ్వర్యంలో టీ విరామ సమయంలో ప్లే కార్డు ప్రదర్శన ద్వారా మోమరండంలోని సమస్యలను పరిష్కరించాలని దర్నా చేయటం జరిగింది. ఈ కార్యక్రమంను ఉద్దేశించి డిపో సెక్రెటరీ కె.వి.రత్నం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిపోవర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ డి ఎ.రాజక్, ఎస్ కే జి.భాష కృష్ణారెడ్డి, పి. భాస్కర్‌లతో పాటు గ్యారేజ్ ప్రెసెడెంట్, ఏ.ఎంరాజా, గ్యారేజ్ సెక్రటరీ కె.యల్.రావు శివ కుమార్, కృష్ణ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై విస్తృత ప్రచారం

కోట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పిస్తూ కోట మండలం వెంకన్నపాలెంలోని మోడల్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి చదువు ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, విద్యాహక్కు చట్టం గురించి వివరించారు. బడి ఈడు పిల్లలు అందరు బడిలో ఉండాలని కోరారు. పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు మహ్మద్ రఫ్వి, సులోచన రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీసిటీ డైకిన్ ప్లాంట్‌ని సందర్శించిన డైకిన్ గ్లోబల్ ప్రెసిడెంట్

శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ పట్ల ప్రశంస

సత్యవేడు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నొఫుమీ టకేనాక గురువారం శ్రీసిటీలోని డైకిన్ ఇండియా తయారీ కేంద్రాన్ని సందర్శించారు. డైకిన్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.జె.జావా ఆయనకు ఆహ్వానం పలికారు. ప్లాంట్ పనితీరుపై సమీక్ష జరిపిన టకేనాక, ప్లాంట్ నిర్వహణ, సాంకేతిక నైపుణ్యం, దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళిక తదితర అంశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా టకేనాక, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి కొద్దిసేపు సమావేశమయ్యారు. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా శ్రీసిటీ ఎదుగుదలను రవీంద్ర సన్నారెడ్డి ఈ సందర్భంగా టకేనాకకు వివరించారు. ముఖ్యంగా ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సుస్థిరత ద్వారా ఈ ప్రాంతం యొక్క పారిశ్రామిక వృద్ధికి డైకిన్ అందించిన గణనీయమైన సహకారాన్ని ఆయన ప్రశంసించారు. శ్రీసిటీ పెట్టుబడి దారుల అనుకూల పర్యావరణ వ్యవస్థను ప్రశంసించిన టకేనాక, పారిశ్రామిక వాడ స్థాయి, సామర్థ్యం, ఆధునిక మౌలిక సదుపాయాలను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం, శ్రీసిటీ బృందం అందిస్తున్న సహాయ సహకారాల పట్ల స్పందించిన ఆయన శ్రీసిటీలో మరింత విస్తరించడానికి డైకిన్ ప్రణాళికలను కలిగి ఉందని తెలిపారు. పర్యటన పట్ల టకేనాకకు కృతజ్ఞతలు తెలిపిన సన్నారెడ్డి, ఏసీ కంప్రెషర్లను ఉత్పత్తి చేయడానికి తైవాన్‌కు చెందిన రెచీ సంస్థ భాగస్వామ్యంతో డైకిన్ ఏర్పాటు చేస్తున్న నూతన తయారీ కేంద్రం, దేశంలో ఏసీ తయారీ హబ్‌గా ఎదగాలన్న శ్రీసిటీ లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తోందన్నారు. మంచి పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను ఎంపొందించాలన్న శ్రీసిటీ దృష్టికి సరితూగేలా సాంకేతిక, స్థానిక అభివృద్ధి ప్రాధాన్యతతో డైకిన్ పయనిస్తోందని వ్యాఖ్యానించారు.

విశ్రాంతి పోస్టల్ ఉద్యోగిపై దాడి!

శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: మండలంలోని బివిపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఇ.లక్ష్మయ్యపై తన అన్న కుమారులు దాడి చేసినట్లు సంఘటన గురువారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు ఇ.లక్ష్మయ్య, తన అన్న ఇ.వెంకటసుబ్బయ్య మధ్య ఆస్తి తగాదా గత కొన్ని రోజులుగా వుందని, ఈ విషయమైన దాడి జరిగిందని తెలిపారు. గురువారం మధ్యాహ్నం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి అవదూత ఆశ్రమం నందు ఇ.లక్ష్మయ్య ఉండగా అన్న కుమారుడు సుధాకర్, వదిన ఇ.వెంకటసుబ్బమ్మ కలసి కర్రతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఇ.లక్ష్మయ్య ఎడమ కన్నుపై భాగంలో రక్తగాయం కావడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి చిక్సిత చేరినట్లు వివరించారు. ఈ దాడికి సంబంధించిన వివరాలతో శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులు చేస్తున్నట్లు తెలిపారు.

శాస్త్రసోక్తంగా మహా సుదర్శనహోమం

-వసంతోత్సవంతో ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు

తవణంపల్లె, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: మండలంలోని అరగొండ శ్రీకోదండరామ స్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం ఆలయంలో మహా సుదర్శనహోమం, వసంతోత్సవం, శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమంలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మహాసుదర్శనహోమంకు ఆలయ ధర్మకర్త అపోలో ఆస్పత్రులు ఛైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి కుటుంబీకులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈమేరకు ఆలయ మండపంలో అర్చకులు, రుత్విజులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వుంచి శాస్త్రోక్తంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, కలశపూజ, సుదర్శనహోమం, మహా పూర్ణాహుతి, సంప్రోక్షణ కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తూ వసంతోత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు చిన్న,పెద్ద తేడా లేకుండా వసంతాలు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమానికి అరగొండ కృష్ణారెడ్డి అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఇదిలా వుండగా అరగొండ సత్సంగం వారి ఆధ్వర్యంలో చివరగా శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే గ్రామ పెద్దలకు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. దీనితో ఈనెల 6 నుండి జరిగిన శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వహకులు,అర్చకులు ప్రసాద్‌స్వామి,ఉత్సవ ఉభయదారులు,అరగొండ పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

కటారి కేసు 22 కు వాయిదా..!

చిత్తూరు టౌన్,ఏప్రిల్ 17 ప్రభాతవార్త: చిత్తూరు మాజీ మేయర్ కటారి అనురాధ ఆమె భర్త కటారిమోహన్ ల హత్య కేసు ఈనెల 22 కు వాయిదా పడింది. 2015 నవంబర్ 17 న చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కటారి దంపతుల హత్య జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి చింటూ అలియాస్ చంద్రశేఖర్‌తో పాటు మరో 22 మందిని నిందితులుగా పేర్కొంటూ పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 2016 నుండి వివిధ కారణాల వల్ల ఈ కేసులో సాక్షుల విచారణ జరగలేదు. ఈ క్రమంలోనే 2023లో ఈ కేసు విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2023 ఫిబ్రవరి 17 నుండి చిత్తూరులోని ఆరవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సాక్షుల విచారణ చేపట్టింది. 56 మంది సాక్షులను విచారించి వారి వాంగ్మూలాలను కోర్టు రికార్డు చేసింది. కటారి దంపతుల హత్య కేసును అప్పట్లో దర్యాప్తు చేసిన చిత్తూరు డిఎస్పి లక్ష్మీనా